E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 06-01-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక: 06|| పేజీలు–6 www.ekaburu.com




వైభవ్ విధ్వంసం.. రెండో యూత్ వన్డేలో భారత్ ఘన విజయం

» 4లో

## ఢిల్లీ గాలిలో మందులకు లొంగని బ్యాక్టీరియా



» అన్నిచోట్లా స్టాఫిలోకోకై బ్యాక్టీరియా

» జేఎన్‌యూ అధ్యయనంలో వెల్లడి

అసలే విపరీతమైన వాయుకాలుష్యంతో కునారిల్లుతున్న దేశ రాజధాని ఢిల్లీ వాతావరణంలో.. శక్తిమంతమైన యాంటీబయాటిక్ మందులకు సైతం లొంగని సూపర్ బగ్స్ వ్యాపిస్తున్నాయని జేఎన్‌యూకు చెందిన స్కూల్....

తరువాయి 2లో

## 13 ఏండ్ల బాలికపై ముగ్గురు మైనర్ల హత్యాచారం


» ఫోన్‌లో వీడియోలు తీసి బెదిరింపులు

» కర్నాటకలోని హుబ్లీలో దారుణం

» 2 లో



# మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోండి






» 'గోదావరి జల వివాదం'పై కూర్చుని మాట్లాడుకోండి..

» తెలంగాణ, ఏపీలకు సుప్రీంకోర్టు హితవు

» మధ్యవర్తిత్వం, సివిల్ సూట్ సహా 3 ప్రత్యామ్నాయ మార్గాలను ప్రతిపాదించిన ప్రధాన న్యాయమూర్తి

» నిబంధనలకు విరుద్ధంగా ఏపీ 'పోలవరం–నల్లమల సాగర్' ప్రాజెక్టు చేపట్టిందన్న తెలంగాణ

» సీడబ్ల్యూసీ వద్దన్నా ముందుకు వెళుతోందని, టెండర్లు కూడా పిలిచిందని వెల్లడి

» తక్షణమే స్టే ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి

» ప్రస్తుతం పీఎఫ్ఆర్, డీపీఆర్ కోసం సర్వేలు, టెండర్ల ప్రక్రియ మాత్రమే చేపట్టామన్న ఏపీ

» తదుపరి విచారణ ఈ నెల 12వ తేదీకి వాయిదా

ఈకబురు, న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నెలకొన్న గోదావరి జలాల వివాదాన్ని న్యాయ పోరాటాలతో కంటే.. సామరస్య పూర్వకంగా, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం మేలని సుప్రీంకోర్టు సూచించింది. సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని చెప్పింది. మధ్యవర్తిత్వంతో సహా మూడు పరిష్కార మార్గాలను భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ రెండు రాష్ట్రాల ముందుంచారు. పోలవరం ప్రాజెక్టును అనుసంధానిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా 'పోలవరం-నల్లమల సాగర్' ఎత్తిపోతల పథకం చేపట్టిందని, ఇందుకు సంబంధించి టెండర్లు పిలిచిందని, దీనిపై తక్షణమే స్టే ఇవ్వాలంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం జస్టిస్ జాయ్‌మాల్యా బగ్చితో కూడిన సీజేఐ ధర్మాసనం సుదీర్ఘ విచారణ జరిపింది. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి, ఏపీ తరఫున మరో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, ఇతర న్యాయవాదులు వాదనలు విన్పించారు.

**మా నీటిని తరలించుకుపోయే కుట్ర: తెలంగాణ**

సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. 'ఏపీ ప్రభుత్వం గోదావరి ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. గోదావరి బేసిన్‌లో తెలంగాణకు 968 టీఎంసీల వాటా ఉంది. పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు ద్వారా ఏపీ 200 టీఎంసీలను మళ్లిస్తే తెలంగాణ వాటాకు గండి పడుతుంది. వరద జలాల పేరుతో తెలంగాణకు కేటాయించిన నీటిని తరలించుకుపోయే కుట్ర ఇది. ఈ ప్రాజెక్టును ఆపాలని ఆదేశించాలి. అనుమతులు లేకుండా ముందుకెళ్లొద్దని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

తరువాయి 2లో

పీఎఫ్ ఖాతా నుంచి LIC ప్రీమియం కట్టొచ్చని తెలుసా?

» 4లో




కొత్త ఏడాదిలో మెరుపులకు సిద్ధం

» 5లో





## వెనిజులా వనరులు మాకివ్వాల్సిందే.. లేదంటే భారీ మూల్యం చెల్లింక తప్పదు: ట్రంప్

తరువాయి 3లో



## ఫోన్ ట్యాపింగ్ కేసు.. హరీశ్‌రావుకు సుప్రీంలో ఊరట

తరువాయి 3లో

## నైతికత లేని పార్టీ బీఆర్ఎస్



» నాది ఆస్తి పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పోరాటం

» వ్యక్తిగా వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా చట్టసభకు తిరిగివస్తా

» మండలిలో కవిత భావోద్వేగ ప్రసంగం

» వచ్చే ఎన్నికల నాటికి రాజకీయ పార్టీగా 'జాగృతి' ఎదుగుతుందని ప్రకటన

హైదరాబాద్,ఈకబురు : నారాయణగూడ: "భారాస 8 పేజీల రాజ్యాంగం ఒక పెద్ద జోక్. ఆ పార్టీలో రాజ్యాంగ స్ఫూర్తి లేదు. నన్ను సస్పెండ్ చేయడానికి రాత్రికి రాత్రే క్రమశిక్షణ చర్యల కమిటీ పుట్టుకొచ్చింది. నైతికత లేని పార్టీలో నేను ఉండను. ఇది ఆస్తుల పంచాయితీ అని కాంగ్రెస్ అంటోంది. మా కులదైవం లక్ష్మీనరసింహస్వామి, నా ఇద్దరు కుమారులపై ప్రమాణం చేసి చెబుతున్నా. నాది ఆస్తుల పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పోరాటం. ఇక్కడి నుంచి వ్యక్తిగా వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా చట్టసభకు తిరిగివస్తా. వచ్చే ఎన్నికల నాటికి 'తెలంగాణ జాగృతి' రాజకీయ పార్టీగా ఎదుగుతుంది. ఒక ఆడబిడ్డగా ముందడుగు వేస్తున్నా.. ఆశీర్వదించండి" అని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శాసనమండలిలో సోమవారం కవిత భావోద్వేగంగా మాట్లాడారు.

తరువాయి 2లో



## చైనీస్ మాంజాపై ఉక్కుపాదం

విక్రయించినా, నిల్వ చేసినా క్రిమినల్ కేసులు
–హైదరాబాద్ సీపీ సజ్జనర్

ఈ-కబురు హైదరాబాద్: సంక్రాంతి పండుగ వేళ నిషేధిత చైనీస్ మాంజా విక్రయాలు, వాడకంపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్, తెలిపారు. పక్షుల స్వేచ్ఛకు, అమాయక వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తున్న ఈ ప్రమాదకరమైన మాంజాను ఎవరైనా రహస్యంగా విక్రయించినా, నిల్వ ఉంచినా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

» 2లో

## పూలే దంపతుల జీవితం..నేటి తరానికి స్ఫూర్తిదాయకం

» కుల నిర్మూలనకు, మహిళా విద్యకు వారి పోరాటం అద్భుతం: సీఎం

» మంత్రులతో కలిసి 'పూలే' సినిమాను చూసిన రేవంత్‌రెడ్డి

» ఆర్టీసీ బస్సులో సినిమాకెళ్లిన నేతలు

తరువాయి 2లో



## నల్లమలసాగర్‌పై సూట్ దాఖలు చేస్తాం

» 12న సుప్రీం కోర్టులో విచారణకు నేనే హాజరవుతా: ఉత్తమ్

హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పోలవరం - నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు నిర్మాణంపై స్టే ఇవ్వాలంటూ 12న రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టులో సూట్ దాఖలు చేయనున్నట్లు మంత్రి...



తరువాయి 2లో

# పూలే దంపతుల జీవితం..నేటి తరానికి స్ఫూర్తిదాయకం



మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, (ఈకబురు,): సామాజిక సంస్కర్తలపై వచ్చే సినిమాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సామాజిక విప్లవకారులు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే జీవితచరిత్ర ఆధారంగా తెరకెక్కిన 'పూలే' సినిమాను సీఎం తన మంత్రివర్గ సహచరులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సోమవారం వీక్షించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. కుల నిర్మూలన కోసం పూలే దంపతులు చేసిన పోరాటం అద్భుతమని కొనియాడారు. మహిళా విద్యావ్యాప్తి కోసం వారు ఎదుర్కొన్న సవాళ్లను సినిమాలో కళ్లకు కట్టినట్టు చూపించారని ప్రశంసించారు. సోమవారం శాసనసభ వాయిదాపడిన అనంతరం.. మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ సామాన్యుడిలా ఆర్టీసీ బస్సులో ప్రయాణించి బంజారాహిల్స్‌లోని ప్రసాద్‌ల్యాబ్స్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ''ఏంటన్నా.. సినిమాకు వెళ్తున్నారా'' అని ప్రశ్నించిన విలేకరులతో.. ''అభినవ పూలే పొన్నం (మంత్రి పొన్నం ప్రభాకర్) పిలిస్తే వెళ్లకుండా ఉంటానా?'' అంటూ సరదాగా బదులిచ్చారు.

**అద్భుతమైన సందేశాన్నిచ్చే సినిమా: డిప్యూటీ సీఎం భట్టి**

ఈ సినిమా సమాజానికి అద్భుతమైన సందేశాన్ని అందించే చిత్రమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మహిళల కోసం పూలే దంపతులు చూపిన శ్రద్ధ ఆదర్శనీయమైనదన్నారు. కులవివక్షలాంటి ఇబ్బందులను తట్టుకుని సమసమాజ స్థాపనకు కృషిచేశారన్నారు. సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం, పూలే ఆశయాల సాధన కోసం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

## నల్లమలసాగర్‌పై
# సూట్ దాఖలు చేస్తాం

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్,ఈకబురు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పోలవరం నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు నిర్మాణంపై స్టే ఇవ్వాలంటూ 12న రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టులో సూట్ దాఖలు చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సూట్ పిటిషన్‌గా మార్చి సమర్పించాలని సూచించిన కోర్టు.. కేసును 12వ తేదీకి వాయిదా వేసిందని గుర్తు చేశారు. 12న జరిగే విచారణకు స్వయంగా తానే హాజరవుతానని చెప్పారు. రానున్న రెండు రోజుల్లో న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందిస్తామన్నారు. సోమవారం మీడియాతో ఆయన చిట్ చాట్‌గా మాట్లాడారు. పోలవరంనల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు నిర్మాణాన్ని తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక సైతం వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి హరీశ్‌రావు చూపిస్తున్నది అంతర్గత సమాచారం కోసం సీడబ్ల్యూసీ పంపిన లేఖ అని, ఇది ప్రాజెక్టును ఆమోదించినట్లు కాదని అన్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకే బీఆర్ఎస్ నేతలు అర్థరహితమైన ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాగా, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు డీపీఆర్ తయారీ కోసం రూ.10కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో అవసరమైన చోట్ల కొత్త రేషన్‌షాపులు మంజూరు చేస్తామని ఉత్తమ్ ప్రకటించారు.

# చైనీస్ మాంజాపై ఉక్కుపాదం

మొదటి పేజీ తరువాయి

నిబంధనలు అతిక్రమించిన వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చైనీస్ మాంజా నియంత్రణ, తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి అధికారులకు సీపీ సజ్జనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పండుగ పూట గాలిపటాలు ఎగురవేయడం సంప్రదాయమే అయినప్పటికీ, అది ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారకూడదని హితవు పలికారు. చైనీస్ మాంజా పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తోందని, ఇది మట్టిలో కలిసిపోక ఏళ్ల తరబడి అలాగే ఉండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం ప్రభుత్వం చైనీస్ మాంజా తయారీ, విక్రయం, నిల్వ, వినియోగంపై పూర్తి స్థాయి నిషేధం విధించిందని గుర్తుచేశారు. ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు నగరవ్యాప్తంగా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు. నగరంలోని అన్ని జోన్లలోని కైట్స్ విక్రయ కేంద్రాలు, చిన్న కిరాణా దుకాణాలు, అనుమానిత గోదాములపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహిస్తారని స్పష్టం చేశారు. కేవలం విక్రయదారులే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి అక్రమంగా ఈ నిషేధిత మాంజాను రవాణా చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు, పార్శిల్ సర్వీసులపైనా నిఘా పెంచామని, వారి ప్రమేయం ఉన్నట్లు తేలితే ఏజెన్సీ యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సీపీ సజ్జనర్ విజ్ఞప్తి చేశారు. చైనీస్ మాంజాలో ప్లాస్టిక్, ఇతర సింథటిక్ పదార్థాలతో పాటు గాజు పెంకుల మిశ్రమం పూతగా ఉంటుందని, దీనివల్ల ద్విచక్ర వాహనదారుల మెడలు తెగిపోవడంతో పాటు, పిల్లల వేళ్లు తెగిపోయే ప్రమాదం ఉందని వివరించారు. అంతేకాకుండా, ఇందులో ఉండే మెటాలిక్ పదార్థాల వల్ల విద్యుత్ తీగలకు తగిలినప్పుడు షాక్ కొట్టి పిల్లలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దయచేసి తల్లిదండ్రులు తమ పిల్లలకు సంప్రదాయ నూలు దారాలను మాత్రమే ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. నగర పౌరులు కూడా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సీపీ పిలుపునిచ్చారు. మీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు లేదా నిల్వ చేసినట్లు గమనిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి గానీ, హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నెంబర్ +91 94906 16555 గానీ లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.



# 13 ఏండ్ల బాలికపై ముగ్గురు మైనర్ల హత్యాచారం



మొదటి పేజీ తరువాయి

**ఈ-కబురు, హుబ్బళి: కర్నాటకలోని హుబ్బళిలో దారుణం చోటు చేసుకున్నది. 13 ఏండ్ల బాలికను ముగ్గురు మైనర్లు గ్యాంగ్‌రేప్ చేశారు. నిందితులంతా 14 నుంచి 15 ఏండ్ల మధ్యవాళ్లే అని పోలీసులు తెలిపారు. బాధితురాలికి ముగ్గురు బాలురు ముందు నుంచే తెలుసని వివరించారు. నిందితులను అరెస్ట్ చేసి పోక్సో యాక్ట్ కింద కేసు రిజిస్టర్ చేసినట్లు తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు బాలురు ఇంట్లోకి చొరబడ్డారు. తర్వాత ఆమెను ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు.**

**అక్కడ ముగ్గురు కలిసి బాలికను సామూహికంగా అత్యాచారం చేశారు. ఈ దారుణాన్ని నిందితులు తమ ఫోన్లలో వీడియో తీశారు. దీని గురించి ఎవరికైనా చెప్తే ఆ వీడియోను సోషల్ మీడియాలో పెడతామని బాలికను బెదిరించారు. అయితే, బాలిక ధైర్యం చేసి జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులకు వివరించింది. బాలిక పేరెంట్స్ ఫిర్యాదు మేరకు హుబ్బళి పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఇద్దరు హైస్కూల్ స్టూడెంట్లు కాగా, మరొకరు చదువు మధ్యలో ఆపేసినట్లు గుర్తించారు. వారు తీసిన వీడియో ఆధారాలను సేకరించేందుకు నిందితుల మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సహాయం అందజేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.**

# నైతికత లేని పార్టీ బీఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి




ఒక దశలో కంటతడి పెట్టారు. అనంతరం గన్‌పార్కు వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి మాట్లాడారు.

**అవినీతిపై చెప్పినా పట్టించుకోలేదు**

''తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు.. దిల్లీలో అప్పటి కాంగ్రెస్ అగ్రనేత ఫెర్నాండెజ్‌తో.. కేసీఆర్ సమావేశాన్ని ఏర్పాటు చేయించడంలో నేను కీలకంగా వ్యవహరించా. ఆ మరుసటి రోజే సోనియాగాంధీతో సంప్రదింపులు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ఊపందుకుంది. పార్టీయే పిలిచి నాకు నిజామాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చింది. కానీ, తెలంగాణ ఏర్పడ్డ తర్వాత మొదటి బతుకమ్మ పండగ నుంచే నా మీద ఆంక్షలు మొదలయ్యాయి. ధర్నాచౌక్‌ను తీసివేయాలని నిర్ణయిస్తే వ్యతిరేకించాను. రైతులను అక్రమంగా అరెస్టు చేసి బేడీలు వేయడం బాధగా అనిపించింది. అమరజ్యోతి, సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, కలెక్టరేట్ల నిర్మాణంలో అవినీతి జరిగిన మాట నిజం. సిద్దిపేట, సిరిసిల్లల్లో కట్టిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయంటే.. అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇసుక దందాల కారణంగా నేరెళ్ల లాంటి దురాగతాలు జరిగాయి. పార్టీలో, ప్రభుత్వంలో జరిగిన అవినీతిని, కొందరి వరుస దురాగతాలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదు. తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని చెప్పినా పట్టించుకోలేదు. తెరాసను భారాసగా మార్చడాన్నీ నేను ఒప్పుకోలేదు. తెలంగాణలో ఏం సాధించామని జాతీయ పార్టీగా మార్చారు? తెలంగాణ వచ్చాక.. అవినీతి లేని పారదర్శక విధానాన్ని మనం చూడాలనుకున్నాం. కానీ, అది జరగలేదు. మరోవైపు తెలంగాణను భాజపా పదేపదే మోసం చేసింది. ఒక్క జాతీయ ప్రాజెక్టునూ రాష్ట్రానికి ఇవ్వలేదు. కేసీఆర్‌పై కోపంతో నన్ను జైల్లో పెట్టారు. ఈడీ, సీబీఐలతో మూడేళ్లు నేనే పోరాటం చేశా. హరీశ్‌రావు పేరు చెప్పిన రెండు గంటల్లో నన్ను సస్పెండ్ చేశారు. అన్యాయంగా పార్టీ నుంచి వెళ్లగొట్టారు. భారాస చేసిన తప్పులనే కాంగ్రెస్ చేస్తోంది'' అని కవిత పేర్కొన్నారు. తన రాజీనామాను ఆమోదించాలని మండలి ఛైర్మన్‌ను కవిత కోరగా.. భావోద్వేగాలతో తీసుకున్న నిర్ణయంపై పునరాలోచన చేయాలని ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు.

# మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోండి

మొదటి పేజీ తరువాయి



అయినా ఏపీ ప్రభుత్వం వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. పోలవరం నుంచి అక్రమంగా 200 టీఎంసీల వరద నీటిని మళ్లించేందుకు వీలుగా టెండర్లు పిలిచింది. సీడబ్ల్యూసీ అనుమతులు లేకుండా, కనీసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ఆమోదం పొందకుండానే ఏపీ ప్రాజెక్టు పనులు చేపడుతోంది. ప్రస్తుతం సీడబ్ల్యూసీ చైర్మన్ నేతృత్వంలో వేసిన కమిటీకి ప్రాజెక్టు పనులను ఆపే అధికారం లేదు. కాబట్టి సుప్రీం కో ర్టు వెంటనే జోక్యం చేసుకుని కేంద్రం నియమించిన కమిటీ నివేదిక వచ్చేంత వరకైనా పనులను నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలి..' అని విజ్ఞప్తి చేశారు.

**హై ద రా బా ద్ పో యిం ది .. నీ ళ్లు కూడా వద్దా?: ఏపీ**

ముకుల్ రోహత్గీతో పాటు సీనియర్ న్యాయవాదులు బల్బీర్ సింగ్, జైదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ.. 'పోలవరం-నల్లమల సాగర్ విషయంలో ఏపీ ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదు. ప్రస్తుతం ప్లానింగ్ దశలోనే ఉన్నాం. ప్రీ ఫీజబిలిటీ రిపోర్టు (పీఎఫ్ఆర్), డీపీఆర్ తయారీ కోసమే సర్వేలు, టెండర్ల ప్రక్రియ చేపట్టాం. క్షేత్రస్థాయిలో నిర్మాణాలు చేయడం లేదు. గోదావరి నుంచి సముద్రంలో వృథాగా కలుస్తున్న నీటిని కరువు ప్రాంతమైన రాయలసీమకు అందించాలన్నదే ఏపీ ఉద్దేశం.

ఇది ఆ రాష్ట్ర అంతర్గత అవసరాల కోసం చేపడుతున్న ప్రాజెక్టు..' అని వెల్లడించారు. రోహత్గీ వాదిస్తూ.. 'ఇప్పటికే రాష్ట్ర విభజనలో ఏపీ నుంచి హైదరాబాద్‌ను తీసేసుకున్నారు. ఇప్పుడు సముద్రంలో కలిసే నీళ్లు కూడా వాడుకోకూడదా?..' అని ప్రశ్నించారు. 2014 విభజన చట్టం ద్వారా ఈ జాతీయ ప్రాజెక్టుకు తెలంగాణ సమ్మతి తెలిపినట్టేనని బల్బీర్ సింగ్ అన్నారు. తెలంగాణ పిటిషన్ దురుద్దేశపూర్వకమైనదని జైదీప్ గుప్తా చెప్పారు.

**ప్లానింగ్ దశలోనే ఉండొచ్చు కానీ..: సీజేఐ**

వాదనల సమయంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఏపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. తాము కేవలం ప్రాజెక్టు నివేదికల తయారీ కోసమే టెండర్లు పిలిచామన్న వాదనలపై స్పందిస్తూ.. 'ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్లానింగ్ దశలోనే ఉండొచ్చు. కానీ ఒకవేళ భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు నిబంధనలకు విరుద్ధమని తేలి ఆగిపోతే.. ప్లానింగ్, డాక్యుమెంటేషన్ కోసం ఖర్చు చేసిన ప్రజల నిధులు వృథా అవుతాయి కదా?' అని ప్రశ్నించారు. ఈ పిటిషన్ విచారణార్హతను పరిశీలిస్తున్నామని చెప్పారు.

**మూడు పరిష్కార మార్గాలు**

ఈ కేసులో ఏదో ఒక నిర్ణయం తీసుకునే ముందు, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మూడు ప్రధాన పరిష్కార మార్గాలను ఇరు రాష్ట్రాల ముందు ఉంచారు. వీటిలో ఏదో ఒకటి ఎంచుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించారు. 'మొదటి మార్గంగా.. ఇది రెండు రాష్ట్రాల నడుమ తలెత్తిన జల వివాదం కాబట్టి, ఆర్టికల్ 32 కింద రిట్ పిటిషన్‌గా కాకుండా, ఆర్టికల్ 131 ప్రకారం 'సివిల్ సూట్'గా దాఖలు చేస్తే సమగ్ర విచారణ జరిపేందుకు కోర్టుకు వెసులుబాటు ఉంటుంది. రెండవ మార్గంలో.. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ వివాదంపై ఒక హై పవర్ కమిటీని ఏర్పాటు చేసినందున, ఆ కమిటీకి.. తెలంగాణ లేవనెత్తుతున్న అభ్యర్థనలను పరిశీలించి, అవసరమైతే ఆ ప్రాజెక్టును నిలిపివేసే (స్టే ఇచ్చే) 'నిర్ణయాధికారాన్ని' కల్పిస్తూ కోర్టు ఆదేశాలిచ్చే అవకాశం ఉంది.

ముఖ్యమైన మూడవ మార్గంగా.. కోర్టు తీర్పుల దాకా వెళ్లకుండా, ఇరు రాష్ట్రాల ప్రతినిధులు కలిసి కూర్చుని, మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను స్నేహపూర్వకంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయవచ్చు..' అని చెప్పారు. ఈ ప్రతిపాదనలపై తమ ప్రభుత్వ నిర్ణయాన్ని తెలుసుకునేందుకు సమయం కావాలని తెలంగాణ తరఫు న్యాయవాది సింఘ్వీ కోరడంతో.. ధర్మాసనం తదుపరి విచారణను జనవరి 12వ తేదీకి వాయిదా వేసింది.



# ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ - కొమిరిశెట్టి ఫౌండేషన్ ల ముత్యాల ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రామస్వామి యాదవ్ తదితరులు

### రంగురంగుల రంగవల్లులతో ఆకట్టుకున్న మహిళలు

ఈకబురు, శేరిలింగంపల్లి : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. మొత్తం 35 కాలనీలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తుండగా, ప్రతి కాలనీలో పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 5 ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా విభావరి టవర్స్ , బీహెచ్ఈఎల్ ఎంఐజి కాలనీ, జనని మహిళామండలి, సింధు ఆదర్శ మహిళా మండలి, చందానగర్ లో గల వెంకటాద్రి కాలనీ, మియాపూర్ లో న్యూ కాలనీ , ఎంఏ నగర్ కాలనీలలో మహళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షుడు కొమిరిశెట్టి సాయిబాబా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవులు మాట్లాడుతూ పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులు అని అన్నారు. ముగ్గుల పోటీలతో మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తి వెలికి రావడానికి అవకాశం ఉంటుందని, పట్టణీకరణ నేపథ్యంలో అపార్టుమెంట్ల సంస్కృతి పెరిగిన తరువాత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నానాటికి కనుమరుగవుతున్నాయని అన్నారు. నేటి యువతరానికి మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసేందుకు ఈ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు వాణిసాంబశివరావు , ఉమాచంద్రశేఖర్ విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియోషన్ నాయకులు బిఎన్ రెడ్డి, రాజేష్ ,శ్రీనివాస్ మహిళా నాయకురాళ్లు శ్రీమంతులు వరలక్ష్మి , వాణి , కుమారి , రాణి యాదవ్ , నాగమణి, లక్ష్మి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు అమ్మయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదులో ఆధారాలతో సమర్పించిన పలు అక్రమ నిర్మాణాలు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న మిద్దెల మల్లారెడ్డి



ఫిర్యాదులో ఆధారాలతో సమర్పించిన పలు అక్రమ నిర్మాణాలు

### డిప్యూటీ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన మిద్దెల మల్లారెడ్డి

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి సర్కిల్ 20 పరిధిలోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తూ.. అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజల కోసం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో సర్కిల్ 20 డిప్యూటీ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు .ఈ సందర్భంగా మిద్దెల మల్లారెడ్డి మాట్లాడుతూ శేరిలింగంపల్లి సర్కిల్ 20 పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో టౌన్ ప్లానింగ్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అక్రమ నిర్మాణాల సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేసి, సదరు నిర్మాణాలు కొనసాగకుండా క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణదారులతో లాలూచీ పడుతున్నారని విమర్శించారు. ముఖ్యంగా సర్కిల్ 20 పరిధిలో చైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న మోహన్ మీద ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. సర్కిల్ 20 ఏసీపీ వెంకటరమణ సైతం అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందినా స్పందించడం లేదని, నిర్మాణదారులకు సహకరిస్తున్నాడని వాపోయారు. అక్రమ నిర్మాణాల కారణంగా ఏదైనా ప్రమాదం సంభవిస్తే కొద్ది రోజులు హడావిడి చేసే అధికారులు అనంతరం నిర్మాణాలను అడ్డుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. జిహెచ్ఎంసి ఖజానాకు భారీగా గండి కొడుతూ, ప్రమాదభరితంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు, సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. శేరిలింగంపల్లి సర్కిల్ 20 పరిధిలో కొనసాగుతున్న పలు అక్రమ నిర్మాణాలను ఆధారాలతో అధికారులకు అందజేయడం జరిగిందన్నారు.

# సినిమాల్లో సీన్లే ప్రేరణ... అన్‌లైన్ వీడియోలతో శిక్షణ...





పోలీసులకు పట్టుబడిన నిందితుడు కాటమయ్య

### ఏటియం చోరీకి ప్రయత్నించిన యువకుడు
### బెడిసికొట్టిన పన్నాగం - పోలీసులకు చిక్కి కటకటాల్లోకి

ఈకబురు, శేరిలింగంపల్లి : ఆహ్లాదాన్ని పంచే సినిమాలు... విజ్ఞానాన్ని పెంచే అన్‌లైన్ ను కొంతమంది తమ వక్రబుద్ధికి వాడుకుంటున్నారు. సినిమాల్లో నిమిషాల్లో ఏటీఎంలు, బ్యాంకులను లూటీ చేసి భారీ ఎత్తున కొల్లగొట్టే సీన్లను చూసి ప్రేరణ పొందిన ఓ యువకుడు నిజజీవితంలోనూ దాన్ని అమలు చేసే ప్రయత్నం చేశాడు. అనుకున్నదే ఆలస్యం లూటీ చేయడం కోసం అన్‌లైన్ లో శోధించి వీడియోలను వీక్షించాడు. ఏటీఎంలో డబ్బులు దొంగిలించడం ఎలా అని అన్‌లైన్ లో వీడియోలు చూసి చోరీకి పథక రచన చేశాడు కానీ సినిమాల్లో మాదిరి నిజజీవితంలో ఉండదని గుర్తించలేక పోయాడు. స్థానికుల అప్రమత్తతతో యువకుడి పన్నాగం బెడిసికొట్టగా పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్‌కుమార్ కథనం ప్రకారం...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురంకు చెందిన వడ్డె కాటమయ్య(24) డిగ్రీతో చదువుకు ఫుల్ స్టాప్ పెట్టాడు. సులభంగా డబ్బు సంపాదించడం కోసం వక్రబుద్ధులు ఆలోచించాడు. సినిమాలలో బ్యాంకులు, ఏటీఎంలలో లూటీ చేసి కోట్లు కొల్లగొట్టే సీన్లను చూసి ప్రేరణ పొందాడు. అచ్చం అదే తరహాలో నిజజీవితంలోనూ చోరీ చేయాలని పథకం వేశాడు. ఇందుకోసం అన్‌లైన్‌నే వేదిక చేసుకున్నాడు. అన్‌లైన్లో 'ఏటియంలో డబ్బులు చోరీ చేయడం ఎలా' అని సెర్చ్ చేసి, పలు వీడియోలు చూసి నేర్చుకున్నాడు. అన్‌లైన్ లో నేర్చుకున్న తన చోరీ జ్ఞానంతో సెక్యూరిటీ తక్కువగా ఉండే ఎస్‌బీఐ బ్యాంకు ఏటియంలో చోరీ చేయాలని పథకం వేశాడు. ఆదివారం రాత్రి కాటమయ్య మరో వ్యక్తి రామాంజనేయులుతో కలిసి హఫీజ్‌పేట్ మార్తండనగర్‌లోని ఎస్‌బీఐ ఏటియంలోకి వెళ్లారు. సినిమాల్లో మాదిరిగా ఏటిఏంలో మిషన్ కు ప్రత్యేక డివైజ్ ఏర్పాటు చేసి డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నించారు. కానీ ఏటీఎం వద్ద భిన్నంగా కనిపించిన వీరిని అనుమానించిన స్థానిక యువకుడు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కాటమయ్యను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల రాకను చూసిన రామాంజనేయులు అక్కడి నుండి పరారయ్యాడు. ఈ ఘటనపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మొదటి పేజి తరువాయి

# గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ముందు పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఈకబురు, శేరిలింగంపల్లి : చిట్టీల డబ్బుల వివాదంతో మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...గోపనపల్లి ఎన్టిఆర్ నగర్ కు చెందిన పవన్ నాయక్(25) అనే వ్యక్తి ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. కాగా ఇతను స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి వద్ద నెలవారి చిట్టీ వేస్తున్నాడు. చిట్టీ డ్రా తీయగా, మొదటి నెలలోనే పవన్ కు చిట్టీ వచ్చింది. మొదటి నెల కావలంతో 3.5 లక్షల తక్కువ డబ్బు వస్తుండడంతో తనకు తెలిసిన వ్యక్తి అయిన మోహన్ కు విషయం చెప్పాడు. దీంతో మోహన్ సదరు 3.5లక్షల రూపాయలు తానే చెల్లిస్తానని, ఇచ్చిన డబ్బుకు వడ్డీ లేదా తనకు అవసరం ఉన్నప్పుడు చిట్టీ లేపి ఇవ్వాలని అన్నాడు. ఈ అంగీకారం మీద పవన్ చిట్టీ తీసుకోకుండా మోహన్ వద్ద డబ్బులు తీసుకున్నాడు. కాగా డబ్బులు తీసుకున్న తరువాత పవన్ నెలనెల చిట్టీ సక్రమంగా కట్టకపోగా, చిట్టి తీసుకునేందుకు వచ్చి సంతకం పెట్టమంటే సైతం పెట్టకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో మోహన్ పలుమార్లు అడిగి విసిగి పోయాడు. చివరికి సోమవారం ఉదయం పవన్ ఇంటికి వెళ్లిన మోహన్ తాను ఈ విషయమై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేస్తానని చెప్పి వచ్చాడు. మోహన్ పిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్ కు వెళ్తున్నాడని తెలుసుకొని పవన్ నాయక్ సైతం వెనుకే గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చాడు. పోలీస్ స్టేషన్ పార్కింగ్ ప్రదేశంలో మోహన్ ను కలిసిన పవన్ నాయక్... పోలీసులకు పిర్యాదు చేస్తే తాను పురుగుల మందు తాగి చనిపోతానంటూ బెదిరించి, తనతో పాటు తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న గచ్చిబౌలి పోలీసులు పవన్ నాయక్ ను వెంటనే స్థానికంగా ఉన్న కొండాపూర్ ఆసుపత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ విషయమై ఇరువర్గాల నుంచి పిర్యాదు రాలేదని, పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని గచ్చిబౌలి ఇన్స్ పెక్టర్ బాలరాజు తెలిపారు.

# ఉరివేసుకొని 8వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

ఈకబురు, శేరిలింగంపల్లి : తల్లి మందలించిందని ఓ 8వ తరగతి విద్యార్థి తాను ఉంటున్న ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా పోరుమామిళ్ల మండలం అక్కలరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దాసరిపల్లి మోహన్ తన భార్య, కుమారుడు దాసరిపల్లి శివకుమార్(14) తో కలిసి బ్రతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చాడు. ఐటి కారిడార్ పరిధిలోని గౌలిదొడ్డి జయభేరి ఫోర్ సీజన్ లో వాచ్ మెన్ గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఇతని కుమారుడు శివకుమార్ నగరంలోని నారాయణ స్కూల్ లో 8వ తరగతి చదువుతున్నాడు. గత రెండు, మూడు రోజులుగా వరుస సెలవులు రావడంతో శివకుమార్ స్కూల్ కు వెళ్లలేదు. సోమవారం నుంచి స్కూల్ ప్రారంభం అవుతుండడంతో ఆదివారం ఇంట్లో ఉన్న మోహన్ భార్య తన కుమారుడికి బ్యాగు, పుస్తకాలు సర్దుకోవాలని, సోమవారం నుంచి స్కూల్ ఉన్న కారణంగా హడావిడీ చేస్తావంటూ మందలించింది. అనంతరం మోహన్ భార్య ఇంట్లో పని చేసుకుంటుండగా, సాయంత్రం 5 గంటలకు ఇంట్లో చూడగా. సీలింగ్ రేకులకు ఉన్న రాడ్డుకు కుమారుడు శివకుమార్ ఉరివేసుకొని నిర్జీవంగా కనిపించాడు. దీంతో తల్లి వెంటనే మోహన్ కు విషయం చెప్పింది. మోహన్ వెళ్లి చూడగా, అప్పటికే శివకుమార్ మృతిచెందాడు. దీంతో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# వెనిజులా వనరులు మాకివ్వాల్సిందే.. లేదంటే భారీ మూల్యం చెల్లింక తప్పదు: ట్రంప్

వెనిజులా వనరులు మాకివ్వాల్సిందేనని, లేదంటే భారీ మూల్యం చెల్లింక తప్పదని ట్రంప్ హెచ్చరించారు.వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెజ్‌కు యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ఆ దేశ అధ్యక్షురాలిగా ఆమె ప్రమాణం చేయడాన్ని ముందు స్వాగతించిన ట్రంప్.. ఆ తర్వాత తమ దేశంలోని సహజ వనరులను కాపాడుకుంటామంటూ డెల్సీ ప్రకటించగానే మండిపడ్డారు. డెల్సీ సరిగా నడుచుకోకపోతే మదురో కంటే పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. యూఎస్‌లోకి డ్రగ్స్ పంపుతున్నారంటూ వెనిజులాపై దాడి చేసి, మదురోను అరెస్టు చేసిన అమెరికా.. ఆ తర్వాత నుంచి వెనిజులా సహజ వనరులపై ఫోకస్ పెట్టారు. అక్కడి ఆయిల్ నిల్వలను యూఎస్ కంపెనీలు చేతికి అందించాలని డిమాండ్ చేయడం మొదలు పెట్టారు. ఇలాంటి సమయంలో సహజ వనరులను కాపాడుకుంటూమంటూ డెల్సీ ప్రకటించడంతో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆమె కనుక సరైన పద్ధతిలో నడుచుకోకుంటే.. మదురో భారీ మూల్యం చెల్లించుకుంటుంది' అంటూ ట్రంప్ బెదిరించారు.తాజాగా ప్రమాణం చేసిన వారితో డీల్ చేస్తున్నామని, అదే సమయంలో మరోసారి సైనిక దళాలను పంపేందుకు తాము రెడీగా ఉన్నామని ట్రంప్ చెప్పారు. వెనిజులాలో సరైన సమయంలో ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. వెనిజులాలోని చమురు, ఇతర సహజ వనరుల నిల్వలపై యూఎస్‌కు వంద శాతం యాక్సెస్ ఇవ్వాల్సిందేనని ట్రంప్ తేల్చిచెప్పారు. వేరే దేశాధ్యక్షుడిని బంధించడాన్ని కూడా సమర్థించుకున్న ట్రంప్.. 'అక్కడ పునర్నిర్మాణం చేయడం లేదా అధికారాన్ని మార్చడం.. ఏ పేరుతో అయినా పిలవండి. కానీ అక్కడ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల కంటే అదే బెటర్. ఇంతకంటే పరిస్థితి దిగజారేది ఏమీ ఉండదు' అని చెప్పుకొచ్చారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. హరీశ్‌రావుకు సుప్రీంలో ఊరట

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు కు ఊరట లభించింది. హరీశ్‌రావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. వారిద్దరికీ వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం విచారణ చేపట్టింది. గతంలో హరీశ్, రాధాకిషన్‌పై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు క్వాష్ చేసింది. ఈ నేపథ్యంలో ధర్మాసనం స్పందిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. అనంతరం పిటిషన్లను కొట్టివేస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

# ఢిల్లీ గాలిలో మందులకు లొంగని బ్యాక్టీరియా

న్యూఢిల్లీ, జనవరి 5: అసలే విపరీతమైన వాయు కాలుష్యంతో కునారిల్లుతున్న దేశ రాజధాని ఢిల్లీ వాతావారణంలో.. శక్తిమంతమైన యాంటీ బయాటిక్ మందులకు సైతం లొంగని సూపర్ బగ్స్ వ్యాపిస్తున్నాయని జేఎన్‌యూకు చెందిన స్కూల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ పరిశోధకుల అధ్యయనంలో తేలింది. బయటి వాతావరణంలోనే కాదు.. ఇళ్లల్లో ఉండే గాలిలో కూడా మందులకు లొంగని 'స్టాఫిలోలోకోకై' అనే బ్యాక్టీరియా ఆనవాళ్లు కనిపించాయని వారు పేర్కొన్నారు. వారు సేకరించిన 100 నమూనాలకుగాను 73 నమూనాల్లో బ్యాక్టీరియా సింగిల్ డ్రగ్ రెసిస్టెంట్ (అంటే ఒకరకం యాంటీబయాటిక్ ఔషధానికి లొంగనివి) కాగా.. 36 నమూనాల్లో మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ (అంటే పలు రకాల యాంటీబయాటిక్స్‌కు నిరోధకత సంతరించుకున్న) బ్యాక్టీరియా ఉన్నట్టు ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన మాధురీ సింగ్ తెలిపారు. కాగా.. డబ్ల్యూహెచ్‌వో సూచించిన పరిమితి ప్రకారం.. గాలిలో స్టాఫిలోకోకై లోడ్ 1000 సీఎఫ్‌యూ/ఎం3 (ప్రతి ఘనపు మీటరుకూ 16వేల కాలనీస్ ఫర్ యూనిట్) లోపే ఉండాలి. కానీ ఢిల్లీ గాలిలో.. 16,000 సీఎఫ్‌యు/ఎం3 ఉండడం ఆందోళన కలిగిస్తోంది. స్టాఫిలో కోకై బ్యాక్టీరియా సాధారణంగా మన చర్మంపైన, ముక్కులోపల ఉండే మ్యూకస్ పొరల్లోనూ ఉంటుంది. మనలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే.. మొటిమల వంటి చిన్న సమస్య నుంచి.. న్యూమోనియా, సెప్సిస్, సెప్టిసీమియా వంటి తీవ్ర సమస్యల దాకా రకరకాల అనారోగ్యాలకు కారణమవుతుంది. రోగనిరోధక శక్తి అంతగా ఉండని వృద్ధులు, చిన్నపిల్లలు, క్యాన్సర్ బాధితులు, అవయవమార్పిడి చేయించుకున్నవారికి ఈ బ్యాక్టీరియా చాలా ప్రమాదకరం.

# ఈ ఏడాది ఏఐలో భారీ మార్పులొస్తాయ్



**వాస్తవ ప్రపంచంపై దృష్టి పెట్టండి**
**మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల**

ఈ ఏడాది కృత్రిమ మేధ (ఏఐ)లో భారీ మార్పులు వస్తాయని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల అంచనా వేశారు. ఈ సాంకేతికతకు సంబంధించి, ప్రతి ఒక్కరూ కొత్తదనం దశను దాటి, వాస్తవ ప్రపంచ ప్రభావంపై దృష్టి పెట్టాలని సూచించారు. 'స్లాప్ వర్సెస్ సోఫిస్టికేషన్' వాదనల నుంచి ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. 'లుకింగ్ ఎహెడ్ టు 2026' పేరిట బ్లాగ్‌లో పలు విషయాలను సత్య నాదెళ్ల పంచుకున్నారు. మానవ సామర్థ్యాలను పెంచడానికి ఏఐ ఒక టూల్‌గా ఉంటుందని, ప్రత్యామ్నాయం కాదని ఆయన స్పష్టం చేశారు. ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో ప్రోడక్ట్ డిజైన్, సామాజిక పరిగణనల ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. ఆఫీస్, విండోస్ స్థానంలో ఏఐ ఏజెంట్లు: వృత్తి జీవితానికి ఏఐ హానికరమంటూ మాట్లాడటాన్ని ఆపేయాల్సిన సమయం వచ్చిందని సత్య నాదెళ్ల పేర్కొన్నారు. ఏఐ పరిశ్రమ కొత్తదనం నుంచి మరిన్ని సవాళ్ల సమయంలోకి అడుగుపెట్టిందని వెల్లడించారు. పలు దశాబ్దాలుగా వేలాది కంపెనీలకు సేవలు అందించిన ఆఫీస్, విండోస్ సాఫ్ట్‌వేర్ స్థానంలో, ఏఐ ఏజెంట్‌లను వినియోగించాలని మైక్రోసాఫ్ట్ భావిస్తోందని తెలిపారు. ఏఐను స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని, మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనలో దోహదపడే టూల్‌గా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిక జీవితంలో ఏఐను ఎలా ఉపయోగిస్తారనే దానిపైనే.. ఈ సాంకేతికత వినియోగం ఆధారపడి ఉంటుందని వివరించారు. 'కోపైలట్, అనుబంధ ఉత్పత్తులను బలోపేతం చేయడానికి, మరిన్ని అధునాతన ఏఐ మోడళ్లపై మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెడుతోంది. ఒక మోడల్ ఎంత శక్తివంతమైనది అనే దానిపైనే ఏఐ అసలు ప్రభావం ఆధారపడి ఉంటుంది. ప్రజలు దాన్ని ఎలా ఉపయోగిస్తాన్నదీ ముఖ్యమే' అని నాదెళ్ల అన్నారు.

# కోల్ ఇండియా అనుబంధ సంస్థ బీసీసీఎల్ ఐపీఓ 9 నుంచి

**కోల్‌ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్)తో పాటు మరో 4 చిన్న, మధ్యస్థాయి కంపెనీల (ఎస్ఎంఈ) ఐపీఓలు ఈ వారమే నిధులు సమీకరించబోతున్నాయి. బీసీసీఎల్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 9-13 తేదీల్లో ఉండనుంది. ధరల శ్రేణి, లాట్ పరిమాణం, ఇష్యూ నిర్మాణం వంటివి సోమవారం వెల్లడి కానున్నాయి.**

**మిగతా 4 ఐపీఓలు ఎస్ఎంఈ విభాగం నుంచి రాబోతున్నాయి. ఇందులో గాబియన్ టెక్నాలజీస్ ఇష్యూ ముందుగా రాబోతోంది. 36 లక్షల షేర్లను విక్రయించడం ద్వారా రూ.29.16 కోట్లు సమీకరించబోతోంది. ధరల శ్రేణి రూ.76-81. జనవరి 6-8 తేదీల్లో ఈ ఐపీఓ ఉండనుంది. దీని తర్వాత విక్టరీ ఎలక్ట్రిక్ వెహికల్స్ ఇంటర్నేషనల్, యజుర్ ఫైబర్స్ ఐపీఓలు ఈనెల 7-9 తేదీల్లో రాబోతున్నాయి. విక్టరీ ఎలక్ట్రిక్ వెహికల్స్ ఇంటర్నేషనల్ రూ.34.56 కోట్లు సమీకరించే లక్ష్యంతో, ఐపీఓలో 84.3 లక్షల షేర్లను, ఒక్కోటి రూ.41 చొప్పున విక్రయించబోతోంది. యజుర్ ఫైబర్స్ 69.2 లక్షల షేర్లను విక్రయించడం ద్వారా రూ.120.4 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.168-174.**

**రబ్బర్ విడిభాగాలు తయారు చేసే డిఫ్రెయిల్ టెక్నాలజీస్ ఐపీఓ ఈ నెల 9-13 తేదీల్లో రాబోతోంది. 18.6 లక్షల షేర్లను విక్రయించడానికి సిద్ధమవుతోంది. ధరల శ్రేణి వెల్లడించలేదు**




# సానుకూలతలున్నా.. అప్రమత్తతే

**జీడీపీ ముందస్తు అంచనాలు కీలకం**

**కార్పొరేట్ల డిసెంబరు త్రైమాసిక ఫలితాలు కూడా**

**లోహ, వాహన, సిమెంటు షేర్లు రాణించొచ్చు**

**విశ్లేషకుల అంచనాలు**

దేశీయ స్టాక్ మార్కెట్లలో, సమీప భవిష్యత్తులో సానుకూలతలు కొనసాగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత్అమెరికా ఒప్పందం మరింత ఆలస్యమైతే, రూపాయి బలహీనపడొచ్చు. బుధవారం వెలువడే తొలి ముందస్తు జీడీపీ (202526) అంచనాల కోసం మదుపర్లు ఎదురు చూస్తున్నారు. 2026లో ఈక్విటీ మదుపర్లకు మెరుగైన ప్రతిఫలాలే కనిపించొచ్చని, అయితే విదేశీ పెట్టుబడుల ప్రవాహంపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు, ఈనెల తొలి 2 రోజుల్లోనే రూ.7,608 కోట్ల విక్రయాలు జరపడం గమనార్హం. గతేడాది తరహాలోనే ఈ ఏడాదిలోనూ నిఫ్టీ 50 లాభాలు ఉండొచ్చని, కార్పొరేట్ ఫలితాలు బాగుంటే, మరింత ప్రతిఫలం లభిస్తుందని ఓ బ్రోకరేజీ అంటోంది. ఈనెల 12న టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ ఫలితాలు వెల్లడి కానున్నాయి. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలు ఇలా.. ఆర్థిక ఫలితాలకు ముందు ఈవారం నిఫ్టీ బ్యాంక్ రాణించొచ్చు. దీనికి 59,80059,500 వద్ద కీలక మద్దతు ఉంది. 60,50060,700 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు. 59,500 దిగువన లాంగ్ పొజిషన్ల నుంచి ట్రేడర్లు బయటకు వచ్చే అవకాశం ఉన్నందున, సెంటిమెంటు బలహీనపడొచ్చు. హకంపెనీల షేర్లు మరిన్ని లాభాలు అందించొచ్చు. కేంద్ర విధానాలు, స్థూల ఆర్థిక అంశాలు కలిసి రావొచ్చు. 'పడినపుడల్లా కొనుగోలు చేయడం' మంచి పద్ధతి అవుతుంది. స్వల్పకాలంలో నిఫ్టీ లోహ సూచీ సానుకూలంగానే కనిపిస్తోంది. ఓవర్‌బాట్ పరిస్థితుల వల్ల తక్కువ శ్రేణిలో కదలికలుండొచ్చు. లికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా షేరుకు కొంత విక్రయాల ఒత్తిడి ఉండొచ్చు. ఏజీఆర్ బకాయిల విషయంలో లభించిన ఊరట ప్రభావం పెద్దగా కనిపించకపోవచ్చు. రూ.6 లక్ష్యంతో ఈ షేరును విక్రయించొచ్చని ఓ బ్రోకరేజీ చెబుతోంది. భారతీ ఎయిర్‌టెల్‌కు రూ.2,140 వద్ద నిరోధం, రూ.2,000 వద్ద మద్దతు కనిపిస్తోంది. మురుగ్యాస్ కంపెనీల షేర్లు సమీప కాలంలో సానుకూల ధోరణిలో చలించొచ్చు. నిఫ్టీ ఆయిల్‌గ్యాస్ సూచీకి 12,100 11,950 వద్ద మద్దతు, 12,60012,700 వద్ద నిరోధం కనిపిస్తోంది. ఫలితాలకు ముందు యంత్రపరికరాల షేర్లు ఒక శ్రేణిలోనే చలించొచ్చు. ప్రధాన కంపెనీలన్నీ బలమైన ఆదాయ వృద్ధిని నమోదు చేయొచ్చు. అయితే ఆర్డర్ల రాక తగ్గడం, షేర్ల అధిక ధరల కారణంగా ఈ రంగ




షేర్లకు విక్రయాల ఒత్తిడి ఏర్పడొచ్చు. వాహన కంపెనీల షేర్లు రాణించొచ్చు. రిటెయిల్ గిరాకీ కొనసాగుతుండడం, ఎగుమతులు బాగుండడం ఇందుకు నేపథ్యం. షేర్ల ధరలు అధికంగా ఉన్నా, ఫలితాలు బాగుంటాయన్న అంచనాల మధ్య కాస్త పెరగొచ్చనే భావిస్తున్నారు. కొంత స్తబ్దత తర్వాత విలువలు పుంజుకుంటుండడంతో, ఐటీ షేర్లు లాభాలు అందుకోవచ్చు. ఫెడ్ వడ్డీ రేటు కోతల అనంతరం క్లయింట్ల వ్యయాలు పెరగొచ్చన్న అంచనాలకు తోడు, ఏఐ ఆధారిత సేవలకు గిరాకీ పెరుగుతుండడం కలిసిరావొచ్చు. ఈ నెలలో సిమెంటు ధరలు పెరగొచ్చన్న అంచనాల మధ్య సిమెంటు రంగ షేర్లు మెరవవచ్చు. దక్షిణాది రాష్ట్రాల్లో 50 కిలోల బస్తా ధర రూ.2030 వరకు పెరగొచ్చని హైదరాబాద్‌కు చెందిన ఒక సిమెంటు తయారీ కంపెనీ అంటోంది.

ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల షేర్లు నష్టపోవచ్చు. ఈ సూచీ 54,000 57,500 స్థిరీకరణ శ్రేణిలో, దిగువ స్థాయి కంటే కిందకు రావడం ఇందుకు నేపథ్యం. సిగరెట్లపై ఎక్సైజ్ సుంకం విధించడంతో ఐటీసీ షేరు 2023 ఫిబ్రవరి తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయి(రూ.350.05)కి చేరింది. ప్రభావం చూపే వార్తలు లేనందున ఔషధ కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి ట్రేడవవచ్చు. త్రైమాసిక ఫలితాల కారణంగా రాబోయే వారాల్లో ఎంపిక చేసిన ఫార్మా షేర్లు కాస్త పెరగొచ్చు

# స్విగ్గీ నుంచి 'ఈట్‌రైట్'.. వారి కోసం కొత్త కేటగిరీ




ఆహార ప్రియుల అభిరుచులు మారుతున్నాయి. ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతోంది. ఇలాంటి వారి కోసం ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ కొత్త కేటగిరీని ప్రారంభించింది. 'ఈట్ రైట్' పేరుతో దేశంలోని 50 నగరాల్లో కొత్త కేటగిరీని అందుబాటులోకి తెచ్చింది. అధిక ప్రోటీన్, తక్కువ కెలోరీలు, తీపి లేని ఆహార పదర్థాలు వంటి వాటిని ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చింది. మొత్తం 2 లక్షల రెస్టరంట్ల భాగస్వామ్యంతో ఈ కేటగిరీలో ఆహార పదార్థాలను అందిస్తామని స్విగ్గీ తెలిపింది. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టేవారి కోసం దీన్ని ప్రత్యేకంగా ప్రారంభించినట్లు స్విగ్గీ వైస్ ప్రెసిడెంట్ దీపక్ మాలూ చెప్పారు. రోజువారీ ఆహారపు పదార్థాల జాబితా నుంచి వీటిని ప్రత్యేకించి 'ఈట్ రైట్' కేటగిరీ కింద అందిస్తున్నామని తెలిపారు. దీంతో పాటు వ్యక్తుల ఆహారపు అలవాట్లకు సంబంధించి ఒక ఆసక్తికర విషయాన్ని స్విగ్గీ పంచుకుంది. ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఆర్డర్ చేసే వారి సంఖ్య మెట్రో నగరాలతో పోలిస్తే టైర్ 2 నగరాల్లోనే ఎక్కువగా ఉంటోందని తెలిపింది. చండీగఢ్, గువాహటి, లుధియానా, భువనేశ్వర్ వంటివి ఈ జాబితాలో ఉన్నాయని పేర్కొంది.

# పీఎఫ్ ఖాతా నుంచి LIC ప్రీమియం కట్టొచ్చని తెలుసా?

జీవితంలో ఆర్థికంగా ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా బీమాను నిర్లక్ష్యం చేయకూడదనేది ఆర్థిక నిపుణులు చెప్పేమాట. మనకు ఎలాంటి ఆపద వచ్చినా కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేది బీమానే. అందుకే సకాలంలో ప్రీమియం చెల్లింపులు చేయడం ముఖ్యం. కొన్నిసార్లు ఆ ప్రీమియం చెల్లించడానికీ ఆర్థిక కష్టాలు ఎదురుకావొచ్చు. అలాంటి సందర్భంలో పీఎఫ్ ఖాతా నుంచి ప్రీమియం చెల్లించే వెసులుబాటు కల్పిస్తోంది ఈపీఎఫ్ఓ. తాత్కాలికంగా ఆర్థిక కష్టాలు ఎదురైనప్పుడు జీవిత బీమా పాలసీ ల్యాప్స్ కాకుండా ఈ ఆప్షన్ ఉపయోగపడుతుంది. ఈపీఎఫ్ స్కీమ్ ప్రకారం.. కొత్త పాలసీ కొనుగోలుకు, ప్రీమియం చెల్లింపులకు పీఎఫ్ నిల్వలను ఉపయోగించుకునే అవకాశం ఉంది. యాక్టివ్ పీఎఫ్ అకౌంట్ ఉన్నవారు ఈ ఆప్షన్ వినియోగించుకోవచ్చు. రెండు నెలల వేతనానికి సమానమైన నిల్వలు కలిగి ఉండాలి. ఆ పాలసీ చందాదారుడి పేరుమీదే ఉండాలి. జీవిత భాగస్వామి లేదా పిల్లల పేరు మీద ఉన్న పాలసీ ప్రీమియంలు చెల్లించడానికి వీల్లేదు. వార్షిక ప్రీమియంల చెల్లింపులకు మాత్రమే ఉపయోగపడుతుంది. ఇతర ప్రైవేటు బీమా ప్రీమియంలను చెల్లించే వెసులుబాటు లేదు. ఈ ఆప్షన్‌ను వినియోగించాలంటే ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్ నుంచి ఫారం 14ను డౌన్‌లోడ్ చేసుకుని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్‌లోకి వెళ్లి యూఏఎన్, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి. వెబ్‌సైట్‌లోని కేవైసీ సెక్షన్‌లోకి వెళ్లి అక్కడ ఎల్ఐసీ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. పాలసీ నంబర్, ఇతర వివరాలను సమర్పించాలి. పాలసీ వివరాలను లింక్ చేశాక.. ప్రీమియం మొత్తం ఆటోమేటిక్‌గా పీఎఫ్ ఖాతా నుంచి డెబిట్ అవుతుంది. ప్రీమియం తేదీ మిస్ అవ్వకుండా పాలసీ చెల్లింపులు చేయడానికి ఈ ఆప్షన్ ఉపయోగపడుతుంది. ప్రీమియం చెల్లింపులకు బయట రుణం తీసుకోవాల్సిన అవసరాన్ని తప్పిస్తుంది. అదే సమయంలో రిటైర్మెంట్ సేవింగ్స్ కోసం ఉద్దేశించిన పీఎఫ్ నిల్వలు కరిగిపోయే అవకాశం ఉంది. కాబట్టి ఆర్థిక కష్టాలు ఎదురైనప్పుడు మాత్రమే ఈ ఆప్షన్ వినియోగించుకోవడం ప్రయోజనకరమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.




# ఎయిరిండియా సీఈఓ విల్సన్‌కు ఉద్వాసన..?




ఎయిరిండియా ప్రస్తుత సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్‌కు టాటాలు గుడ్‌బై చెప్పనున్నారా? ఆయనపై టాటా గ్రూప్ పెద్దలు అసంతృప్తిగా ఉన్నారా? అంటే అవుననే అంటున్నాయి ఆంగ్ల మీడియా కథనాలు. విల్సన్‌కు త్వరలోనే ఉద్వాసన పలికి.. ఆయన స్థానంలో మరో వ్యక్తిని సీఈఓగా చేయాలని టాటాసన్స్ భావిస్తోందని ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. ఈమేరకు ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థలకు చెందిన సీనియర్ లీడర్లతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అమెరికా, యూకేకు చెందిన రెండు ప్రముఖ విమానయాన సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లతో కూడా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మాట్లాడినట్లు సదరు కథనం పేర్కొంది. విమానయాన సంస్థను వృద్ధిలోకి తీసుకురావడంలో ఆశించిన మేర పనితీరు కనిపించకపోవడంపై చంద్రశేఖరన్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే విల్సన్‌ను మార్చాలని భావిస్తోంది. దీంతోపాటు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు సీఈఓగా వ్యవహరిస్తున్న అలోక్ సింగ్‌ను కూడా మార్చాలని చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎయిరిండియా సీఈఓ విల్సన్ పదవీకాలం 2027 జూన్‌తో ముగియనుండగా.. అలోక్ సింగ్ పదవీకాలం కూడా 2027 వరకు ఉంది.

-విల్సన్‌పై అసంతృప్తి దేనికి?

న్యూజిలాండ్‌కు చెందిన క్యాంప్‌బెల్ విల్సన్ 2022 జులైలో ఎయిరిండియాలో చేరారు. విమానయాన సంస్థను అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దడం, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం వంటి అంశాలతో ఐదేళ్ల ప్రణాళికను ప్రకటించారు. ఇందులోభాగంగా ఎయిరిండియాలో విస్తారా విలీనం సజావుగా సాగింది. కొన్ని కీలక రూట్లలో ఇండిగోను ఎయిరిండియా అధిగమించింది. అదే సమయంలో సప్లయ్ చైన్ అవరోధాల వల్ల కొత్త విమానాల రాక ఆలస్యం అయ్యింది. దీంతో సేవల్లో నాణ్యత, సమయపాలనలో పెద్దగా మెరుగుదల కనిపించలేదు. దీనికితోడు గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర ప్రమాదం తర్వాత సంస్థ ప్రభుత్వ అధికారులు విల్సన్‌ను పక్కనపెట్టి నేరుగా టాటా గ్రూప్ పెద్దలతో మాట్లాడుతున్నారు. ఇదోరకంగా విల్సన్ పక్కన పెట్టడానికి కారణంగా కనిపిస్తోందని 'ఈటీ' పేర్కొంది. నిబంధనలు పాటించకపోవడం, కాలం చెల్లిన లైసెన్స్‌తో విమానం నడపడం వంటి కారణాలతో విల్సన్ సహా పలువురు ఎయిరిండియా ఉన్నతాధికారులకు డీజీసీఏ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసింది. కంపెనీ ఆర్థిక పరిస్థితి కూడా పెద్దగా మెరుగవకపోవడం వంటి కారణాలతో పదవీకాలం పూర్తికాకముందే విల్సన్‌ను తప్పించాలని టాటా గ్రూప్ భావిస్తోంది. దీనిపై టాటా గ్రూప్ అధికారికంగా స్పందించలేదు.

# కొత్త ఏడాదిలో మెరుపులకు సిద్ధం



గతేడాది 'ఛావా', 'కుబేర', 'థమ్మా' 'ది గర్ల్‌ఫ్రెండ్' లాంటి చిత్రాలతో మంచి విజయాల్ని తన ఖాతాలో వేసుకుంది అందాల తార రష్మిక. ఇప్పుడామె కొత్త ఏడాదిలో మెరుపులకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్, రష్మిక, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కాక్‌టెయిల్ 2'. హోమి అదజానియా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామాను సెప్టెంబరులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. "హిందీ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న 'కాక్‌టెయిల్'కు సీక్వెల్‌గా వస్తోన్న ఈ సినిమాను మునుపటి చిత్రం కన్నా ప్రత్యేకంగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకుంది చిత్రబృందం. ఇప్పటికే చిత్రీకరణ చివరి దశకు వచ్చేసింది. నిర్మాణానంతర పనుల్ని శరవేగంగా పూర్తి చేసి ద్వితీయార్థంలో థియేటర్లలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంద"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తుంది.

## సినిమా, టీవీ రంగాల్లో రాణించాలనుందా?.. ఛాన్స్ ఇస్తోన్న దీపికా పదుకొణె

తన పుట్టిన రోజు పురస్కరించుకుని సోమవారం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు బాలీవుడ్ నటి దీపికా పదుకొణె (Deepika Padukone). 'ఆన్‌సెట్' (Deepika Padukone OnSet Project) అనే ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఇది తన డ్రీమ్ ప్రాజెక్టు అని పేర్కొన్నారు. దీని ద్వారా సినిమా, టీవీ, అడ్వర్టయిజింగ్ రంగాల్లో కొత్త ప్రతిభను ప్రోత్సహించి, ఆయా రంగాల్లో వారికి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో ప్రాక్టికల్ లెర్నింగ్‌కే అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు onsetprogram.in లో వివరాలు (వ్యక్తిగతం, ఏ డిపార్ట్‌మెంట్‌లో శిక్షణ పొందాలనుకుంటున్నారు? ప్రస్తుతం ఏ వర్క్ చేస్తున్నారు?లాంటివి) నమోదు చేసుకోవాలని కోరారు. వీరిలో షార్ట్‌లిస్ట్ అయిన వారిని ఇంటర్వ్యూకి పిలుస్తారు. ప్రస్తుతానికి టెక్నికల్ విభాగాల్లో ఛాన్స్ ఉంది. డైరెక్షన్, సౌండ్ డిజైన్, ఆర్ట్ అండ్ ప్రొడక్షన్ డిజైన్ లాంటి వాటికే అవకాశం కల్పించారు. యాక్టింగ్‌కు లేదు.

బర్త్‌డే, ప్రాజెక్టు పరంగా దీపికకు అభిమానులు డబుల్ విషెస్ చెబుతున్నారు. 'కల్కి 2898 ఏడీ'తో దీపిక టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అల్లు అర్జున్ (Allu Arjun) హీరోగా అట్లీ తెరకెక్కిస్తున్న ఓ భారీ బడ్జెట్ సినిమా (AA26)లో నటిస్తున్నారు. షారుక్‌ఖాన్ సరసన 'కింగ్' (King Movie)లోనూ సందడి చేయనున్నారు. 'కల్కి 2', 'స్పిరిట్' సినిమాల అవకాశాలు ఆమె కోల్పోయిన సంగతి తెలిసిందే.



## ఇండస్ట్రీకి వస్తా అనగానే అమ్మ అడిగిన మొదటిమాట ఇదే: రోషన్ కనకాల



తన మొదటి సినిమా విడుదలైనప్పుడు ఎంతోమంది ట్రోల్ చేశారని వాటన్నిటినీ ఎదుర్కొనే ధైర్యం అమ్మే ఇచ్చిందని ఆ విషయంలో తన తల్లికి దండం పెట్టొచ్చని రోషన్ కనకాల (Roshan Kanakala) అన్నారు. ఇటీవల మోగ్లీ 2025లో పలకరించిన రోషన్.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తాను ఎదుర్కొన్న ట్రోల్స్ గురించి చెప్పారు.

''నేను ఇండస్ట్రీకి వస్తాను అని చెప్పగానే అమ్మ ఒకటే మాట అన్నది. 'సోషల్ మీడియాను తట్టుకోగలవా..' అని అడిగింది. అన్నిటినీ ఎదుర్కోగలనని చెప్పా. మొదటి సినిమా 'బబుల్ గమ్' అనంతరం చాలా ట్రోల్స్ వచ్చాయి. నా నటన గురించి కాకుండా లుక్స్ గురించి మాట్లాడారు. నేను చాలా కష్టపడ్డాను. దానిపై మాట్లాడకుండా నా రంగును ఎందుకు చూస్తున్నారనుకున్నా. ఇప్పుడు 'మోగ్లీ 2025' విడుదలయ్యాక లుక్స్ గురించి కాకుండా మరోలా ట్రోల్ చేస్తున్నారు. కొందరు కేవలం ట్రోల్ చేయడం మాత్రమే పనిగా పెట్టుకుంటారని అర్థం చేసుకున్నా. సంబంధం లేకుండా మాట్లాడే వాళ్లను పట్టించుకోకూడదనుకున్నా''

''నేను 'బబుల్ గమ్' ఈవెంట్‌లో ఒక కామెంట్ చేశా.. 'ఇలానే పుట్టాను ఇలానే ఉంటాను' అని ఇప్పటికీ అదే మాట చెబుతాను. మనిషిని నిర్ణయించేది రంగు కాదు.. టాలెంట్ మాత్రమే. ట్రోల్స్‌ను ఎదుర్కోవడంలో మా అమ్మ నాకు ఎంతో ధైర్యాన్నిచ్చింది. మా అమ్మనాన్నలు కలిసి హాయిగా ఉన్న సమయంలోనూ వాళ్లపై ఎన్నో వార్తలు రాశారు. అవేవీ పట్టించుకోకుండా వాళ్ల పని.. వాళ్లు చూసుకున్నారు. అదే నాలో స్ఫూర్తినింపింది. మన గురించి పక్కవాళ్లు ఏం మాట్లాడుకున్నా పట్టించుకోకుండా ముందుకుసాగాలని నిర్ణయించుకున్నా'' అని రోషన్ తెలిపారు.





## క్రిటిక్స్ ఛాయిస్ అవార్డ్స్.. 'అడాల్‌సెన్స్' హవా

సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల వేడుక ఘనంగా జరిగింది. జనవరి 4న జరిగిన ఈ వేడుకలో 'అడాల్‌సెన్స్' (Adolescence) సత్తా చాటింది. నాలుగు కేటగిరీల్లో ఇది అవార్డులను సొంతం చేసుకుంది.

ఉత్తమ సిరీస్‌తో పాటు ఇందులో నటనకు గానూ ఉత్తమ నటుడిగా స్టీఫెన్ గ్రాహం, ఉత్తమ సహాయ నటిగా ఎరిన్ డోహెర్టీ పురస్కారాల్ని సొంతం చేసుకున్నారు. ఈ సిరీస్‌లో తన నటనతో మెప్పించిన ఓవెన్ కూపర్ ఉత్తమ సహాయ నటుడిగా అతి చిన్న వయసులోనే ఈ (Critics Choice Awards) అవార్డును సొంతం చేసుకొని రికార్డు సృష్టించాడు. ఆరు నామినేషన్‌లకు గాను నాలుగు జాబితాల్లో విజేతగా నిలిచింది. గతంలో ప్రకటించిన 77వ ఎమ్మీ పురస్కారాల్లో 5 కేటగిరీల్లో అవార్డులు గెలుచుకొని ఇది చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. గతేడాది మార్చి 17న నెట్‌ఫ్లిక్స్ (Netflix) వేదికగా ప్రేక్షకుల ముందుకువచ్చింది అడాల్‌సెన్స్. విడుదలైన నాటినుంచి భారీ వ్యూస్‌తో టాప్‌లో కొనసాగుతోంది. నెట్‌ఫ్లిక్స్‌లో అత్యధిక వ్యూస్ సాధించిన సిరీస్‌ల జాబితాలో టాప్ 10లో స్థానం సొంతం చేసుకుంది. పిల్లలపై సోషల్‌మీడియా, ఆన్‌లైన్ ట్రోలింగ్ ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తున్నాయనే కోణంలో ఈ సిరీస్‌ను రూపొందించారు. 13 ఏళ్ల వయసున్న కుర్రాడు తన తోటి విద్యార్థినిని హత్య చేసిన నేరంపై జైలుకు వెళ్లిన నేపథ్యంలో దీనిని సిద్ధం చేశారు.

## నాకు హిందీ నేర్పండి!




''నా మాతృభాషని కాపాడుకోవడానికి ఒక గొప్ప సైన్యం ఉందంటు''న్నారు నటుడు శివ కార్తికేయన్. ఆయన శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'పరాశక్తి'. రవి మోహన్, అథర్వ మురళీ నటించారు. పొలిటికల్ యాక్షన్ డ్రామాగా సుధా కొంగర తెరకెక్కించారు. ఆకాశ్ భాస్కరన్ నిర్మాత. ఈ సినిమా ఈ నెల 10న రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం ''తిరుగుబాటుకి ఒక స్వరం.. న్యాయానికి ఒక మూల్యం ఉందం''టూ ట్రైలర్‌ను ఆవిష్కరించింది. ఈ ట్రైలర్ ''నాకు హిందీ నేర్పండి', 'మేము హిందీ మాట్లాడేవారికి వ్యతిరేకం కాదు'' లాంటి సంభాషణలతో ఆద్యంతం ఆసక్తిగా సాగుతుంది. ఈ సినిమా 1960లలో తమిళనాడులోని హిందీ వ్యతిరేక నిరసనల నేపథ్యంతో ఇద్దరు స్నేహితుల చుట్టూ తిరుగుతున్న కథాంశంతో రూపొందినట్లు ట్రైలర్‌తో స్పష్టమవుతోంది.

# రూ.5 కోట్లతో తీస్తే.. రూ.50 కోట్లు వసూలు చేసిన 'ఎకో' ఎలా ఉంది?

**చిత్రం: ఎకో; నటీనటులు: సందీప్ ప్రదీప్, బియానా మోమిన్, నరియన్, సౌరభ్ సచ్‌దేవ్, వినీత్, అశోకన్ తదితరులు; రచన: బహుల్ రమేశ్; దర్శకత్వం: దింజిత్ అయ్యతన్; స్ట్రీమింగ్ వేదిక: నెట్‌ఫ్లిక్స్**

**కథేంటంటే..**

కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలను కలిపే దట్టమైన అటవీ ప్రాంతం కాట్టుకున్ను. అక్కడి కొండపై మిలాతియా (బియానా మోమిన్) అనే వృద్ధురాలు ఒంటరిగా జీవిస్తూ ఉంటుంది. కొండపై కాకుండా గ్రామంలో ఇతర ప్రజలతో కలిసి జీవించాలని ఆమె కుమారులు ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోదు. దీంతో ఆమె బాగోగులు చూసేందుకు పీయోస్ (సందీప్ ప్రదీప్) అనే యువకుడిని నియమిస్తారు. ఆ కొండపైకి ఎవరూ రాకుండా వారికి తోడుగా మలేషియన్ బ్రీడ్ శునకాలు రక్షణగా ఉంటాయి. కొన్ని నెలల కిందట మిలాతియా భర్త కురియాచన్ (సౌరభ్ సచ్‌దేవ్) ఓ క్రిమినల్ కేసులో తప్పించుకుని, అడవిలోకి పారిపోతాడు. అతడి కోసం పోలీసులతో పాటు, మరికొంత మంది కూడా వెతుకుతూ ఉంటారు. కురియాచన్ ఆచూకీ కనుక్కొనేందుకు అడవిలోకి వెళ్లిన అతడి స్నేహితుడు మోహన్ పోతన్ (వినీత్) హత్యకు గురవుతాడు. అసలు కురియాచన్ కోసం అంత మంది ఎందుకు వెతుకుతున్నారు? కొండపై మిలాతియా ఒక్కతే ఎలా ఉండగలుగుతోంది? పీయోష్, మలేషియన్ బ్రీడ్ కుక్కల నేపథ్యం ఏంటి? అన్నది చిత్ర కథ.

**ఎలా ఉందంటే..**

పైన కథ చదివారు కదా. ఇక్కడ ఒక్క నిమిషం ఆగి అసలు నేపథ్యం ఏమై ఉంటుందా? అని ఆలోచించండి. మన ఆలోచనలకు భిన్నంగా తెరపై 'ఎకో' కథ ఉంటుంది. అందుకే మలయాళ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చింది. రూ.5 కోట్లతో తీస్తే.. బాక్సాఫీస్ వద్ద రూ.50 కోట్లకు పైగా వసూలు చేసింది. సినిమా అంటే ఇలాగే తీయాలి.. ఈ ఫార్మాట్‌లోనే ఉండాలనే కొలతలకు నేటి యువ దర్శకులు ఎప్పుడో చరమగీతం పాడేశారు. వారిలోని సృజనాత్మకత మేలుకొన్న వేళ 'ఎకో'లాంటి కథలే వెండితెరపై ఆవిష్కృతమవుతాయి. దర్శకుడు దిజింత్ అయ్యతన్ తీసిన మిస్టరీ థ్రిల్లర్ 'కిష్కింధకాండం' సినీ ప్రియులు చూసే ఉంటారు. 'ఎకో' కూడా ఆ తరహా కథే. దర్శకుడు ఎంచుకున్న పాయింట్ పాతదే. దాన్ని ఆవిష్కరించిన నేపథ్యం కొత్తది. అది చివరి వరకూ మనకు తెలియదు.




'ఎకో'తో దర్శకుడు మనల్ని అందమైన అడవుల్లోకి తీసుకెళ్తాడు.. ఎత్తయిన కొండ ఎక్కిస్తాడు.. మిలాతియా బామ్మ, ఆమె ఇల్లు.. ఆహా ప్రకృతి ఒడిలో ఎంత అందంగా ఉందనుకుంటాం. కానీ, అక్కడున్న కుక్కలు మొరిగే సీన్ క్లోజప్ పడితే గుండె ఝల్లుమంటుంది. భయం గ్రాముల్లో.. కిలోల్లో కాదు.. టన్నుల్లో అనుభూతి అవుతుంది. ఒకవైపు కురియాచన్ కోసం పోలీసులు సాగించే ఇన్వెస్టిగేషన్.. మరోవైపు మిలాతియా ఫ్లాష్ బ్యాక్.. ఇంకోవైపు మోహన్ పోతన్ హత్య ఇలా కథ ముప్పేట ప్రేక్షకుడిని ఊపిరి తీసుకోనివ్వదు. ముఖ్యంగా మలేషియా నేపథ్యంలో సాగే ఫ్లాష్‌బ్యాక్ ఉద్విగ్నంగా ఉంటుంది. కుక్కలు ఇంత క్రూరంగా ఉంటాయా? అనిపిస్తుంది. చివరి అరగంట సినిమాకు ఆయువు పట్టు. కథ, దాని వెనుక ట్విస్ట్‌లు ఒక్కోటి తెలుస్తుంటే, మిలాతియా బామ్మా మజాకా అనిపిస్తుంది. ఆమె దగ్గరకు పీయోస్ ఎందుకు చేరాడో తెలిపే ట్విస్ట్, ఆ క్రమంలో కుక్కలను చూపిస్తూ ఆ పాత్రను లాక్ చేసే సీన్ హైలైట్. అది తెరపై చూస్తేనే ఆసక్తికరం. సినిమా సన్నివేశాలన్నీ చైన్‌లింక్‌లా ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. మధ్యలో మిస్సయితే అర్థం కాదు. అడవిలోకి వెళ్లిన కురియాచన్ పాత్రను కూడా ఇంకాస్త తెరపై ఆవిష్కరిస్తే.. బాగుండేదనిపిస్తుంది.

**ఎవరెలా చేశారంటే..?**

ఇందులో నటించిన వినీత్ ఒక్కడే తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడు. మిగిలిన వాళ్లు పెద్దగా తెలియదు. కానీ, ఆ పాత్రల్లో వారు ఒదిగిపోయారు. పీయోస్‌గా సందీప్, మిలాతియా బామ్మగా బియానా మోమిన్.. కురియాచన్‌గా సౌరభ్ సచ్‌దేవ్ బాగా నటించారు. సాంకేతికంగా సినిమా బాగుంది. తక్కువ పాత్రలతో ఉత్కంఠ, కలిగించే కథ, కథనాలతో దింజిత్ అయ్యతన్ 'ఎకో'ను నడిపిన తీరు బాగుంది. నిడివి సుమారు 2 గంటలు. మలయాళ కథలో ఉండే స్లోనరేషన్ ఇందులోనూ కనిపిస్తుంది. అది భరిస్తే, 'ఎకో అనుభూతిని ఆస్వాదించవచ్చు.

కుటుంబంతో చూడొచ్చా: ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడొచ్చు. నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగు ఆడియోలోనూ అందుబాటులో ఉంది.

**రివ్యూ**

బలాలు
+ కథ, దర్శకత్వం
+ నటీనటులు
+ క్లైమాక్స్

బలహీనతలు
నెమ్మదిగా సాగే కథనం
కొన్ని పాత్రలకు సరైన జస్టిఫికేషన్ ఇవ్వకపోవడం

చివరిగా: 'ఎకో'..సస్పెన్స్ మిస్టరీ థ్రిల్లర్

## ఎంఎస్ ధోని నాకు సోదరుడిలాంటివాడు: బ్రావో



వెస్టిండీస్ మాజీ క్రికెటర్ డ్వేన్ బ్రావో .. టీమ్ఇండియా మాజీ క్రికెటర్ ఎంఎస్ ధోనితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నాడు. అతడు తనకు సోదరుడితో సమానమన్నాడు. 'బ్రదర్ ఫ్రమ్ అనదర్ మదర్' అంటూ.. ధోనితో తనకున్న గాఢానుబంధాన్ని వివరించాడు. అలాగే ధోని నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్‌లో (IPL) విజయవంతమైందని తెలిపాడు. అతడి వ్యవహారశైలి ఇతర ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని పేర్కొన్నాడు. చాలా సందర్భాల్లో తనకు ధోని వెన్నుదన్నుగా నిలిచాడన్నాడు. 'ఒకానొక దశలో ధోని నన్ను ఫీల్డింగ్‌లో డైవ్ చేయకని చెప్పాడు. ఎందుకంటే, నేను నాలుగు పరుగులు ఆపడం కంటే.. నేను వేసే నాలుగు ఓవర్లే జట్టుకు ఎంతో కీలకం అని వివరించాడు. ఆ తర్వాత నుంచి నేను సర్కిల్ లోపల ఫీల్డింగ్ చేయడం ప్రారంభించాను' అని బ్రావో గుర్తు చేసుకున్నాడు. 'మొదటి ఓవర్లో.. ధోని నన్ను ఎలాంటి ఫీల్డింగ్ కావాలని అడిగాడు. నేను నాకేం కావాలో చెప్పాను. ఆ తర్వాత నుంచి అతడు ఫీల్డింగ్ ప్లేస్‌మెంట్ గురించి నాకు ఏమీ చెప్పలేదు. అతడు నాపై పూర్తి నమ్మకం ఉంచడమే దీనికి కారణం. అప్పటినుంచి మేం ఒకరినొకరం బ్రదర్ (బ్రదర్ ఫ్రమ్ ఎ డిఫరెంట్ మదర్) అని పిలుచుకుంటున్నాం' అని డ్వేన్ బ్రావో వివరించాడు. బ్రావో రెండుసార్లు సీఎస్కేకు ప్రాతినిధ్యం వహించాడు. 2011 నుంచి 2015 వరకు ఒకసారి, 2018 నుంచి 2022 మధ్య మరోసారి చెన్నై తరఫున ఆడాడు. అలాగే 2023లో అతడు ఆ జట్టుకు బౌలింగ్ కోచ్ బాధ్యతలూ నిర్వహించాడు. 2025లో బ్రావో.. కోల్‌కతా నైట్ రైడర్స్‌కు మెంటార్‌గా వ్యవహరించాడు. మహేంద్ర సింగ్ ధోని నేతృత్వంలో చెన్నై సూపర్‌కింగ్స్ 2011, 2018, 2021, 2022లో ఐపీఎల్ టైటిళ్లను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.

## వైభవ్ విధ్వంసం.. రెండో యూత్ వన్డేలో భారత్ ఘన విజయం



బెనోని: మూడు యూత్ వన్డేల సిరీస్ కోసం దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న భారత అండర్-19 జట్టు.. వరుసగా రెండో మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. దీంతో యువ భారత్ ఒక మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన రెండో వన్డేలో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా అండర్-19 జట్టు 49.3 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. తర్వాత భారత్ లక్ష్యఛేదనకు దిగింది. కొంతసేపటి తర్వాత వర్షం, ఉరుములు, మెరుపులతో ఆటకు అంతరాయం కలిగింది. దీంతో మ్యాచ్‌ను 27 ఓవర్లకు కుదించి భారత్‌కు 174 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ టార్గెట్‌ని యువ భారత్.. 23.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ (68; 24 బంతుల్లో 1 ఫోర్, 10 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అభిజ్ఞాన్ కుందు (48*), వేదాంత్ త్రివేది (31*), ఆరోన్ జార్జ్ (20) పరుగులు చేశారు. నామమాత్రపు మూడో వన్డే బుధవారం జరగనుంది.

సౌతాఫ్రికా బ్యాటింగ్ విషయానికొస్తే.. నాలుగో స్థానంలో వచ్చిన జాసన్ రోల్స్ (114; 113 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో ఆకట్టుకున్నాడు. మిగతా బ్యాటర్లను భారత బౌలర్లు తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. డేనియల్ బోస్మాన్ (31), అద్నాన్ లగాడియన్ (25), అర్మాన్ మనక్ (16), బుల్బులియా (14), జోరిచ్ వాన్ షాల్క్విక్ (10) పరుగులు చేశారు. భారత బౌలర్లలో కిషన్ కుమార్ సింగ్ 4, ఆర్.ఎస్.అంబరీష్ 2, దీపేశ్ దేవేంద్రన్, కనిష్క చౌహాన్, ఖిలాన్ పటేల్ తలో వికెట్ పడగొట్టారు.

## బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ ప్రసారాలపై నిషేధం

తమ దేశంలో ఐపీఎల్ (IPL) ప్రసారాలపై బంగ్లాదేశ్ ప్రభుత్వం నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి వల్ల హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. దీంతో ఐపీఎల్‌లో ఆ దేశానికి చెందిన ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తీసుకోవడంపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ ఆటగాడిని రిలీజ్ చేయమని బీసీసీఐ(BCCI).. కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంఛైజీని ఆదేశించింది. ఐపీఎల్ మినీ వేలం 2026లో ముస్తాఫిజుర్‌ను రూ.9.20 కోట్ల భారీ ధరకు దక్కించుకున్న కేకేఆర్.. బీసీసీఐ ఆదేశాలతో అతన్ని రిలీజ్ చేసింది. దీంతో బంగ్లాదేశ్ ప్రభుత్వం తాజాగా తమ దేశంలో ఐపీఎల్‌పై నిషేధం విధించింది. అలాగే.. వచ్చే నెలలో భారత్, శ్రీలంక వేదికగా టీ20 వరల్డ్ కప్ 2026 జరగనుంది. తమ మ్యాచ్‌లను భారత్ వెలుపల నిర్వహించాలని, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఐసీసీకి (ICC) విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. '2026 మార్చి 26 నుంచి జరగనున్న ఐపీఎల్ కోసం కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు నుంచి బంగ్లాదేశ్ స్టార్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను మినహాయించడంపై బీసీసీఐ (BCCI) నుంచి ఒక ఆదేశం వెలువడిందని సమాచారం అందుతోంది. భారత క్రికెట్ బోర్డు అటువంటి నిర్ణయం తీసుకోవడానికి ఎటువంటి హేతుబద్ధమైన కారణం తెలియదు. అటువంటి నిర్ణయం బంగ్లాదేశ్ ప్రజలను బాధించింది. ఈ పరిస్థితుల్లో.. తదుపరి నోటీసు వచ్చేవరకు ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేయాలి' అని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆ ఆదేశాల్లో పేర్కొంది.




## మళ్లీ పెళ్లి చేసుకోబోతున్న మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్



భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ తన ప్రేయసి సోఫీ షైన్‌ను త్వరలో వివాహమాడనున్నాడు. ఫిబ్రవరి మూడో వారంలో వీరి పెళ్లి జరగనుందని సమాచారం. ఢిల్లీలో వివాహ వేడుకలు జరుగుతాయని తెలుస్తోంది. ధావన్ పెళ్లికి క్రికెటర్లు, బాలీవుడ్ నటులు హాజరవుతారని సమాచారం. ఐర్లాండ్‌కు చెందిన సోఫీ షైన్ తో ధావన్ రిలేషన్ షిప్‌లో ఉన్నట్లు కొన్ని రోజుల క్రితం వార్తలొచ్చాయి. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను 'గబ్బర్' ఈమెతో కలిసి వీక్షించాడు. దీంతో సోఫీ పేరు వెలుగులోకి వచ్చింది. ఆ మధ్య ధావన్ ఓ కార్యక్రమంలో పాల్గొనగా.. తన గర్ల్‌ఫ్రెండ్ గురించి అడిగారు. దానికి శిఖర్ స్పందిస్తూ 'నేను పేరు చెప్పను. కానీ, నా ప్రపంచంలో అత్యంత అందమైన అమ్మాయి మాత్రం ఆమే' అని వ్యాఖ్యానించాడు. ఆస్ట్రేలియాకు చెందిన బాక్సర్ ఆయేషా ముఖర్జీని ధావన్ 2012లో వివాహం చేసుకున్నాడు. 2014లో వీరికి ఒక బాబు పుట్టాడు. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో 2020 నుంచి దూరంగా ఉన్నారు. 2023లో ఢిల్లీలోని ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసింది.

## షమికి ఎన్నికల కమిషన్ సమన్లు



టీమ్ఇండియా పేసర్ మహమ్మద్ షమి , అతడి సోదరుడు మహమ్మద్ కైఫ్‌లకు ఎన్నికల కమిషన్ (EC) సమన్లు జారీ చేసింది. బెంగాల్‌లో ఎన్నికల వేళ.. చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియలో భాగంగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. షమి ఓటరు మ్యాపింగ్‌కు సంబంధించిన పలు విషయాలపై స్పష్టతనివ్వడానికి అతడు నేడు ఈసీ ముందు హాజరుకావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం షమి విజయ్ హజారే ట్రోఫీలో బెంగాల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నందున విచారణకు హాజరు కాలేకపోయాడు. దీంతో జనవరి 911 మధ్యలో అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ముందు హాజరు కావాలని ఈసీ తాజాగా సమన్లు జారీ చేసింది. షమి యూపీలోని అమ్రోహాలో జన్మించినప్పటికీ.. చాలా ఏళ్లుగా కోల్‌కతాలో స్థిరపడ్డాడు. కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) వార్డు నంబర్ 93లో ఓటరుగా ఉన్నాడు. ఇది రాష్‌బెహారీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ఇటీవల చేపట్టిన సర్ ప్రక్రియలో షమి ఓటర్ మ్యాపింగ్‌కు సంబంధించి సమగ్ర సమాచారం లేకపోవడంతో ఈ విషయంపై విచారణ జరిపేందుకు హాజరు కావాల్సిందిగా ఎన్నికల కమిషన్ ఆదేశించింది. సర్ ప్రక్రియలో భాగంగా తృణమూల్ ఎంపీ, నటుడు దేవ్‌కు కూడా ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఇదీ చదవండి: తలుపులు మూసేశారా!

## కీలక మ్యాచ్‌లు.. ముంబయి కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్

గాయం కారణంగా కొన్ని రోజులుగా ఆటకు దూరమైన శ్రేయస్ అయ్యర్ తిరిగి మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (CoE)లో ఇంటెన్సివ్ రిహాబ్‌ను పూర్తి చేసుకున్న అతడు విజయ్ హజారే ట్రోఫీ లో బరిలోకి దిగనున్నాడు. ముంబయి ఆడాల్సిన చివరి రెండు లీగ్ మ్యాచ్‌లకు అతడిని కెప్టెన్‌గా నియమించారు. ముంబయి రెగ్యులర్ కెప్టెన్ శార్దూల్ ఠాకూర్‌కు గాయం కావడంతో టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. దీంతో శ్రేయస్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలు సాధించిన ముంబయి ఎలైట్ గ్రూప్ సిలో.. 16 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో 128 పరుగుల తేడాతో ఓడటంతో ఆ జట్టు నెట్ రన్‌రేట్ బాగా పడిపోయింది. జనవరి 6న హిమచల్‌ప్రదేశ్‌తో, 8న పంజాబ్‌తో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో కనీసం ఒక్క దాంట్లోనైనా గెలిస్తేనే ముంబయి నాకౌట్ దశకు అర్హత సాధిస్తుంది. మరోవైపు ఈ మ్యాచ్‌లు ముంబయితోపాటు.. శ్రేయస్ అయ్యర్‌కు కీలకం కానున్నాయి. ఇందులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడితేనే అతడికి ఫిట్‌నెస్ క్లియరెన్స్ వస్తుంది. జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు అయ్యర్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే అతడు కివీస్‌తో మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడని జట్టు ఎంపిక సందర్భంగా సెలక్టర్లు స్పష్టం చేశారు.



## ఎడిట్ చేసిన ఫొటోలు వైరల్.. క్రికెటర్ ప్రతీకా రావల్ సీరియస్



మహిళల వన్డే వరల్డ్ కప్ లో అద్భుత ప్రదర్శన చేసిన టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ ప్రతీకా రావల్ 'ఎక్స్'లోని ఏఐ ప్లాట్‌ఫామ్ గ్రోక్ పై సీరియస్ అయ్యారు. తన ఫొటోలను ఎడిట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తుండటంపై తీవ్రంగా స్పందించారు. "నాకు సంబంధించిన ఫొటోలను ఎడిట్ చేయడానికి గ్రోక్‌కు ఎలాంటి అధికారం లేదు. నా ఫొటోలను ఎడిట్ చేయాలని ఏదైనా థర్డ్ పార్టీ అడిగితే.. ఆ అభ్యర్థనను తిరస్కరించండి" అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఎలాన్ మస్క్ కు చెందిన ఏఐ చాట్‌బాట్ గ్రోక్ ఇటీవల వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. గ్రోక్‌ను వాడి కొందరు అసభ్య, అశ్లీల, చట్టవిరుద్ధ కంటెంట్‌ను సృష్టిస్తున్నారు. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మస్క్ స్పందించారు. గ్రోక్ ద్వారా చట్టవిరుద్ధ కంటెంట్ సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ చాట్‌బాట్ తయారు చేస్తున్న కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని భారత ఎలక్ట్రానిక్ అండ్ ఐటీ మంత్రిత్వశాఖ ఎక్స్‌కు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రతీక ఇటీవల ముగిసిన వన్డే ప్రపంచ కప్ లో భారత్ తరఫున రెండో అత్యధిక స్కోరర్. ఆరు ఇన్నింగ్స్‌ల్లో 51.33 సగటుతో 308 పరుగులు చేసింది. భారత జట్టు కప్పు గెలవడంలో కీలక పాత్ర పోషించింది. అయితే, సెమీస్‌కు ముందు గాయం కారణంగా ఆమె టోర్నీకి దూరమైన సంగతి తెలిసిందే.